మరోరోజు కళాగృహంలో.. అందరి మనసూ శృంగారం మీదికి పోయింది.

**''యది హరిస్మరణే సరసం మనో**
**యది విలాసకళాసు కుతూహలం**
**మధుర కోమల కాంత పదావళీం**
**శృణు తథా జయదేవ సరస్వతీం''**

.. విలాస కళలు అన్నాడోయ్ జయదేవుడు. మహా రసికుడోయ్ మహానుభావుడు..'' అన్నాడు సంస్కృత కవి ధవళేశునామయ్య.

ధన మదాంధత పొంగి ప్రవహించే వెలనాడులో శృంగారం.. విచ్చలవిడి బూతు కూడా ఎక్కువే. వణిజులు, ఉత్పత్తిదారులు, వస్తు సరఫరాదారులు.. అందరూ మహాధనవంతులు. రైతులు కూడా కష్టనష్టాల మధ్య బండి నడిపిస్తూ పాతర్లు, పుర్రెలు, గాదెల కొద్దీ పంటరాశులతో ఇతర ధనవంతులకు ఏమాత్రం తీసిపోరు.

సమాజంలో భక్తి, మధుర భక్తి, ముగ్ధ భక్తి, ఆరాధన, తాదాత్మ్యం, మానసిక అనురాగం.. హృదయ స్పందన, ప్రేమపూరిత దగ్గరితనం.. రెండు హృదయాలు ఏకమవ్వడం.. లాంటి కొంగొత్త భావనలు వ్యక్తులలో తీవ్రంగా వ్యక్తమవుతున్న కాలం. చిత్రంగా ఇవన్నీ పెళ్లాడిన భార్యపై కాకుండా, ఇతర స్త్రీలపట్ల ఏర్పడటం ధనమదాంధత వల్ల ఎక్కువయ్యింది. వీళ్లంతా వేశ్యావాటికలలో చేరడం.. అక్కడ గణికలతో ఆడిపాడి సంపాదించిన సొమ్ము విసిరేయడం సాధారణం.

వెలనాడు పండిత, కవి, గాయకులు కూడా ఈ విషయంలో తక్కువ తినలేదు. ఒక్కొక్కడికి ఇద్దరు ముగ్గురేసి ఉంపుడుగత్తెలు. భార్యలు కూడా ఒక్కరు కాదు.. కనీసం ఇద్దరు. సాహిత్యంలో కూడా రసికత, ప్రేమ, అమలిన శృంగారంతోపాటు పచ్చిబూతు నిర్భీతిగా రాస్తున్నారు. ఈ భక్తి ప్రభావిత కావ్యాలకు, ప్రబంధాలకు మతంతో అల్లిన భక్తికి, రక్తితో జతకట్టిన బూతుకు దగ్గరి సంబంధం కుదిరింది. దేవుడు, శృంగారం, భక్తి, మతం.. కలిసి కావ్యానికి గొప్ప సరుకు అయ్యింది.

ఇంతలో నాగయకవి మరో శృంగార గుళిక విసిరాడు. అందరూ చప్పట్లతో అతణ్ని అభినందించారు.

అవన్నీ జాగ్రత్తగా వింటున్న జాయపుణ్ని మరో మిత్రుడు ఆట పట్టించాడు.

''మాట్లాడటంలేదు కానీ, మన జగన్నాథునికి చెవిమైథునం ఎక్కువలాగుంది. ఏమీ మాట్లాడకుండా అన్నీ చెవి రిక్కించి వింటున్నాడు చూడండి!''.

సిగ్గుపడిపోయాడు జాయపుడు.

''ముఖారవిందం చూస్తే పెళ్లి సంగతి ఏమో కానీ.. శృంగారానుభవం కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నది''.

''వేశ్యా సమాగమం ఉండే ఉంటుంది. అందులోనూ అనుమకొండ వాసి అంటే ఇహ చెప్పేదేముంది!? పైగా అందగాడు, నాట్యకారుడు. కనీసంలో కనీసం ఇద్దరు?!.. ఏమంటావ్ జగన్నాథా!?''..

నవ్వుల కృష్ణమ్మకు వరదొచ్చింది. ఉక్కిరిబిక్కిరయ్యాడు జాయపుడు.

మరుక్షణమే లేచి నడుంవద్ద పంచె బిగలాగి, కాళ్లకున్న మట్టెలు బిగించి గొంతు సవరించుకుని.. స్త్రీలా ఒయ్యారంగా స్థానకం తీసుకున్నాడు. ఓ శృంగారగీతాన్ని పాడుతూ నాట్యమాడసాగాడు. జాయపుని అద్భుత నాట్య గానవిలాసం.. అందరూ తొలిసారి చూడటం!

**''పోర సామి వేగ నీవు.. పొద్దుబాయే నీకు చాల**
**చారనిచ్చినందు కూన.. చెయ్యి బట్టి వదలవౌర ॥పోర॥**
**ఇరుగుపొరుగు వారు నన్ను చెరగు బట్ట జూచితేనూ**
**తరిగిపోవు పరువు నాది.. తాకబోకు సామి నన్ను ॥పోర॥''..**

సిగ్గు దొంతరల నడుమ గతరేయి శృంగారాన్ని తలచుకుంటూ ప్రియునికి చెబుతున్న జాగ్రత్తలను మార్గి అభినయ విన్యాసంతో ఓ గ్రామీణ ముగ్ధరాలిగా జాయపుడు నర్తిస్తుంటే.. కవి పండితులందరూ రెప్పవేయకుండా దిమ్మెరబోయి చూస్తున్నారు.

**''హెచ్చుగాను నీవు నన్ను గ్రుచ్చి కౌగిలించ రాకు**
**వచ్చిపోయేవారు జూచి.. రచ్చలెల్ల రద్ది జేయు ॥పోర॥**
**ఎందూకు ఈ రద్ది చేటు మదినిండిన గోపాలుడ..**
**సందకాడ వచ్చి నీవు.. పొందు గూడి పొమ్ము వేగ ॥పోర॥''..**

''పోర సామి వేగ నీవు..''

''పోర సామి వేగ నీవు..''

మొత్తం అక్కడున్న పాతికమంది పండితులు, వింజమాంబ, ఆమె పరిచారికలతోసహా అందరూ జాయపునితో కలిసి.. 'పోరసామి వేగ నీవు.. పోరసామి వేగ నీవు' అంటూ ఆయనతో పాడుతూ ఆడుతూ.. ఎంతో సేపు.. తన్మయత్వ మధురిమతో.. జాయపుని చుట్టూ గంతులు వేసి వేసి కూలబడ్డారు. కూలబడ్డాక పరాశరునితో సహా అందరూ సంభ్రమముఖాలతో లిప్తకాలం ఆయననే చూస్తూ ఉండిపోయి.. ఆనక కరతాళధ్వనులతో హోరెత్తించారు. అందరూ జాయపుని భుజం తట్టారు.. భేషో!!

ఇకపై తాను కూడా చదువుకోడానికి, ప్రదర్శనకు కావాల్సిన సృజనాత్మక సాహిత్యం లిఖించాలని నిర్ణయించుకున్నాడు. తనలో మహాశక్తి ఉన్నదని తెలిసేది రెచ్చగొట్టినప్పుడే.. హనుమంతునిలోనైనా.. జాయపునిలోనైనా!

నిత్యమూ ధనదుపురం రావడం.. కళాగృహంలో కవి పండితులతో కబుర్లు.. వర్తమాన సాహిత్య రచనల వివరాలు, వాటిపై చర్చలు.. జాయపుడు ఎంతో సంతోషిస్తున్నాడు. పెద్దన కళాగృహంలో పరిచయమున్న పండితులను సాహిత్య రచనలను, వాటిలోని అద్భుత అంశాలను విశ్లేషించి చెప్పగలడు. అందరిలోనున్న పాండిత్య ప్రకర్ష, సృజనశీలత, తీవ్రమైన ఉద్వేగ ఉత్సాహాలు.. కృష్ణమ్మకున్న వేగం, వొడుపు వీళ్లకు కూడా ఉండటం జాయపుని కళాత్మక హృదయాన్ని మైమరపిస్తున్నాయి. రానున్న తెలుగుసాహితీ మాగాణిలో వీరంతా అద్భుత రచనా పంటలు పండించగలరు అనుకుంటాడు.

వీరిలో హాలుడు, కాళిదాసులు, భారవిలు, భవభూతులు, భర్తృహరిలు, భాసుడు, బాణులు, మాఘులు, దండి, జయదేవులు.. ఉన్నారని ఆగామి దశాబ్దాలలో వీరంతా తెలుగు సాహిత్యాన్ని, ప్రదర్శన కళలను సమున్నత స్థాయికి తీసుకుపోతారని అతని నమ్మకం.

చిత్రం ఏమిటంటే.. వారందరిలాగే తనూ భరతమునికి వారసుడు కాబోతున్నాడని పసిగట్టలేదు జాయపుడు.



**సిగ్గు దొంతరల నడుమ గతరేయి శృంగారాన్ని తలచుకుంటూ ప్రియునికి చెబుతున్న జాగ్రత్తలను మార్గి అభినయ విన్యాసంతో ఓ గ్రామీణ ముగ్ధరాలిగా జాయపుడు నర్తిస్తుంటే.. కవి పండితులందరూ రెప్పవేయకుండా దిమ్మెరబోయి చూస్తున్నారు.**

* * *

''నారాయణ హరి నమోనమో..
శ్రీమన్నారాయణ నమోనమో!''..

ముందు ఒకరు అంటుండగా, ఎదురుగా కూర్చున్న మరెంతోమంది వంత పాడుతున్నారు. కంచు చిడతల భజనహోరుతో దూరానికే ఆ మందిరం ఖంగు ఖంగుమంటూ ధ్వనిస్తున్నది.

''మునిజన వందిత నమోనమో..
మంగళాంగ నమోనమో..''

వింటూ లోపలికి వెళ్లారు జాయపుడు, పరాశరుడు.

అది ధనదుపురంలోని ప్రధాన వైష్ణవ మఠం. ఎదురుగా వేదికపై ఓ ప్రముఖవ్యక్తి కూర్చుని అర్ధనిమీలిత నేత్రాలతో చిన్నగా ఊగుతుండగా.. ఆయనకు ఆవలగా అదే వేదికపై నిలబడి ఓ వ్యక్తి ఉద్వేగంతో ఊగిపోతూ చిడుతలు మోగిస్తూ ఖంగున పాడుతున్నాడు. కింద కూర్చున్న దాదాపు వందమంది ఆడ, మగ అదే వల్లె వేస్తూ భజన చేస్తూ తన్మయత్వంతో ఊగిపోతున్నారు.

జాయపుడు ప్రశ్నార్థకంగా చూస్తే,

''అవును. ఆయనే ఈ వైష్ణవ మఠాధిపతి యతిరాజులవారు..'' అన్నాడు పరాశరుడు తగ్గుస్వరంతో.

ముక్కుపొడుంలో మీగడ కలిపినట్లున్న శరీరఛాయ.. వయసువల్ల ముడుచుకున్న శరీరం, వడకలై తరహా తిరుమణి (తిరునామాలు), సమ్మిశ్రయనం (భుజాలపై చక్రాంకితాలు), ద్వాదశ ఊర్ధ్వపుండ్రాలు (శరీరంపై తిరు, చందననామాలు), చంకల కిందనుంచి మోకాళ్ల వరకు శరీరానికి కప్పుకొన్న కాషాయ శాలువా, తలపై గోష్పాదమంతటి కొప్పు, దానిలో ముడిచిన తాజా కనకాంబరాలు, భక్తి తాదాత్మ్యతతో వెలుగుతున్న ముఖం..

చూస్తేనే గౌరవం కలిగించే స్వరూపం!!

చిన్ననాడు విద్యఘటికలో చూసిన నాగంభట్టు తండ్రి శివభట్టు గుర్తొచ్చాడు.

అది పూర్తిగా లౌకిక విద్యాసంస్థ అయితే.. ఇది పూర్తిగా మత సంస్థ. వైష్ణవ దేవుళ్ల మహత్తులను.. వైష్ణవ మత విధానాల ప్రాచుర్యంతోపాటు.. సమాజంలో ఆధ్యాత్మిక విలువల వ్యాప్తికోసం పనిచేస్తున్న సంస్థ. కేవలం వైష్ణవ మతాంశాలే ప్రబోధిస్తారు. పరమతసహనం ఉన్నదోలేదో సందేహమే!? నిత్యమూ నిద్ర లేచాక 'ఓం నమశ్శివాయ' అనుకునే జాయపునికి ఇక్కడ ఆ స్మరణ నిషిద్ధమేమోననే సందేహం వచ్చింది. నోరు అదుపులో పెట్టుకోవాలి సుమా..

శ్రీమన్నారాయణుని భజనతో ఓస్థాయి ఉద్వేగంతో, భక్తిభావనలతో పులకించిపోతున్నదా మందిరం. ప్రవేశిస్తూనే పరాశరుడు పరవశుడై భజనలా చేతులతో చప్పట్లు చరుస్తూ శ్రీమన్నారాయణుని భజిస్తూ అందరిలో ఒకడైపోయాడు.

నిజానికి పరాశరుడు వైష్ణవ ఆహార్యంతో కాకుండా, సాధారణ పౌరునిలా ఉంటాడు.

అదే అడిగాడు జాయపుడు.

''నిన్ను చూస్తుంటే.. నీది మారువేషమా? అని సందేహంగా ఉంది పరాశరా!''.

''అదేమిటి అలా అడిగావూ?'' ఆశ్చర్యంగా అన్నాడు పరాశరుడు.

**(సశేషం)**